E-KABURU E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
(తేదీ) 16-07-2025 (వారం) బుధవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



ఏదో ఒకటి చేయాల్సిందే.. సోషల్ మీడియా అభ్యంతరకర పోస్టులపై సుప్రీం » 3లో

## బనకచర్లపై చర్చ అవసరం లేదు: తెలంగాణ సర్కారు లేఖ

» ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనతో అప్రమత్తం
» అనుమతులే లేని ప్రాజెక్టుపై చర్చ
» అసమంజసమంటూ తీవ్ర అభ్యంతరం
» చట్టాలు, ట్రిబ్యునల్ తీర్పులన్నింటినీ ఉల్లంఘిస్తూ ఆ ప్రాజెక్టు చేపట్టారని వెల్లడి
» డీపీఆర్ సమర్పించకుండా, టెండర్లు పిలవకుండా ఏపీని అడ్డుకోవాలని విజ్ఞప్తి
» తెలంగాణ ప్రతిపాదనలే ఎజెండాలో చేర్చాలని స్పష్టీకరణ





ఈ కబురు: తెలంగాణ, ఏపీ మధ్య జల వివాదాలపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ బుధవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన సమావేశం ఎజెండాలో గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును చేర్చడంపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అనుమతులు లేని ప్రాజెక్టుపై చర్చ అసమంజసమని స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టుపై చర్చించాల్సిన అవసరం లేనే లేదని, వెంటనే ఎజెండాను సవరించాలని కోరింది.

తరువాయి 2లో

## భూమిపై దిగిన శుభాంశు శుక్లా.. యాక్సియం4 మిషన్ విజయవంతం

» 18 రోజులపాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో గడిపి క్షేమంగా భూమిపైకి చేరుకున్న భారత వ్యోమగామి
» భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం పసిఫిక్ మహాసముద్రంలో దిగిన డ్రాగన్ 'గ్రేస్' వ్యోమనౌక
» పరీక్షల నిమిత్తం శుభాంశు బృందం క్వారంటైన్‌కు తరలింపు
» మానవసహిత అంతరిక్ష యాత్రలకు భారీ ఊపు



ఈ కబురు: న్యూఢిల్లీ: భారత అంతరిక్ష చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన అద్భుతమైన అధ్యాయానికి ఘనమైన ముగింపు లభించింది. మన వ్యోమగామి, వాయుసేన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా 18 రోజుల అంతరిక్ష యాత్రను విజయవంతంగా ముగించుకుని అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి క్షేమంగా తిరిగొచ్చారు. ఆయనతో పాటు యాగ్జియం-4 మిషన్ బృందంలోని మరో ముగ్గురు వ్యోమగాములను తీసుకుని స్పేస్ ఎక్స్ డ్రాగన్ 'గ్రేస్'వ్యోమనౌక భారత కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం 4:45 గంటలకు ఐఎస్ఎస్ నుంచి విడివడి నింగి నుంచి నేలకేసి సుదీర్ఘయానం ప్రారంభించడం తెలిసిందే.

తరువాయి 2లో

భారత్‌లో టెస్లా ప్రవేశం.. మొదటి షోరూమ్ ఓపెన్ » 4లో




చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ.. వరల్డ్ రికార్డు బద్దలు » 6లో




'సత్యం' మూవీ ఒప్పుకొంటే వద్దన్నారు.. ఆసక్తికర విషయం చెప్పిన జెనీలియా » 5లో



అందుకే రూమర్స్‌ను పట్టించుకోకూడదు: నిధి అగర్వాల్ » 5లో



## గవర్నర్ వద్దకు పంచాయతీ ఆర్డినెన్స్ ఫైల్




*ఈ కబురు: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేగం పెంచింది. దీనికి సంబంధించిన ఫైల్‌ను గవర్నర్ వద్దక పంపింది.*

» 3లో

## రష్యా నడిబొడ్డుపై నిప్పులు కురిపించగలవా?

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి ట్రంప్ సూటి ప్రశ్నలు
ఆయుధాలందిస్తే అంత పనీచేస్తానన్న జెలెన్‌స్కీ



ఈ కబురు: వాషింగ్టన్: దీటైన అస్త్రశస్త్రాలు అందిస్తే మాస్కోను కొట్టగలవా? రష్యాపై భీకరంగా దాడిచేయగలవా? అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూటి ప్రశ్న వేశారు. జూలై నాలుగో తేదీన జెలెన్‌స్కీకి ఫోన్‌చేసిన మాట్లాడిన సందర్భంగా ట్రంప్, వొలదిమిర్ జెలెన్‌స్కీల మధ్య జరిగిన సంభాషణ తాలూకు విశేషాలను తాజాగా అంతర్జాతీయ మీడియా బయటపెట్టింది. ఉక్రెయిన్ రాజధాని నగరం కీవ్‌పై క్షిపణుల వర్షం కురిపిస్తూ తీవ్ర నష్టం చేకూరుస్తున్న రష్యాకు సైతం అదే స్థాయిలో ఆస్తి, ప్రాణ నష్టం కల్గించాలని జెలెన్‌స్కీకి ట్రంప్ సూచించినట్లు తెలుస్తోంది. ఇరునేతల సంభాషణ వివరాలను కొన్ని అత్యున్నత వర్గాలు వెల్లడించాయని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. " చూడు వొలదిమిర్.. నువ్వు రష్యా రాజధాని మాస్కో నగరంపై క్షిపణులతో దాడి చేయగలవా?" అని ట్రంప్ ప్రశ్నించగా.. " తప్పకుండా. మీరు సరైన మిస్సైళ్లు ఇస్తే దాడి చేసి చూపిస్తా" అని జెలెన్‌స్కీ హామీ ఇచ్చారు. " మీకు కావాల్సిన సుదీర్ఘ శ్రేణి క్షిపణులను అందిస్తాం. రష్యాలోని సెయింట్‌పీటర్స్‌బర్గ్‌ను ధ్వంసంచేయగలరా?" అని ట్రంప్ ప్రశ్నించగా.. "ఆ స్థాయిలో దాడికి సరిపడా ఆయుధాలు సమకూరిస్తే తప్పకుండా దాడిచేస్తాం" అని జెలెన్‌స్కీ మాటిచ్చారు.

తరువాయి 2లో

## నిమిష ప్రియకు మరణశిక్ష తప్పేనా?

'బ్లడ్ మనీ'పై మత గురువుతో రాయబారం



ఈ కబురు: యెమెన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటున్న కేరళ నర్సు నిమిష ప్రియకు మరికొన్ని గంటల్లో శిక్ష అమలుచేయనున్నారు. దీన్ని ఆపేందుకు ఆమె కుటుంబానికి ఉన్న ఏకైక అవకాశం 'బ్లడ్ మనీ (క్షమాధనం)'. దీనిపై ఇప్పటికే బాధిత కుటుంబంతో చర్చలు జరుపుతున్నారు. తాజాగా భారత్‌కు చెందిన ఓ ప్రముఖ మత గురువు కూడా ఈ ప్రయత్నాల్లో భాగమయ్యారు. నిమిష ప్రియ ను శిక్ష నుంచి తప్పించేందుకు మత గురువు కాంతాపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ బాధిత కుటుంబంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆమె తరపు న్యాయవాది వెల్లడించారు.

తరువాయి 3లో

## నీటిపారుదలశాఖ మాజీ ఈఎన్‌సీ మురళీధర్‌రావు అరెస్ట్



ఈ కబురు: హైదరాబాద్: నీటిపారుదలశాఖ మాజీ ఈఎన్‌సీ (ఇంజనీర్ ఇన్ చీఫ్) మురళీధర్‌రావు అరెస్టయ్యారు.

» 2లో

## ప్రపంచ దేశాలతోనే పోటీ



» మెరుగైన పారిశ్రామిక విధానాలతో ముందడుగు
» బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్
» రాబోయే రోజుల్లో డేటా సిటీగా మారనున్న నగరం
» జీనోమ్ వ్యాలీలో 'ఐకార్' కొత్త యూనిట్‌కు భూమి పూజ

ఈ కబురు: రాష్ట్రాలతో కాదు.. ప్రపంచ దేశాలతో పోటీ పడాలనేదే తమ ప్రభుత్వ ప్రయత్నమని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇందుకోసం అధునాతన పారిశ్రామిక విధానాలు తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్ రూపుదిద్దుకుంటోందని, దేశంలో నే 33% టీకాలు, బల్క్ డ్రగ్స్‌లో 43% ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతున్నాయని చెప్పారు.రాబోయే రోజుల్లో హైదరాబాద్ డేటా సిటీగా మారనుందని, తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.3 లక్షల 28 వేల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. మంగళవారం శామీర్‌పేట జీనోమ్ వ్యాలీలో ఐకార్ బయోలాజిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ విస్తరణలో భాగంగా 1.75 లక్షల చదరపు అడుగుల్లో నిర్మించనున్న కొత్త ప్లాంట్‌కు మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. జీనోమ్ వ్యాలీతో మంచి గుర్తింపు దేశంలో జీనోమ్ వ్యాలీలోనే టీకాల ఉత్తత్తి జరుగుతోందని, జీనోమ్ వ్యాలీ తెలంగాణకు మంచి గుర్తింపు తీసుకొచ్చిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. కోవిడ్ సమయంలో జీనోమ్ వ్యాలీ నుంచి ప్రపంచ దేశాలకు టీకాను ఎగుమతి చేసిన ఘనత ఇక్కడి పారిశ్రామికవేత్తలదని పేర్కొన్నారు.

తరువాయి 2లో



## గతేడాది 357 మంది మావోల మృతి

» చనిపోయిన వారిలో సానుభూతిపరుడి నుంచి జనరల్ సెక్రటరీ వరకు..
» నక్సల్బరీ పోరాటంలోగతేడాది భారీ నష్టాలు
» గెరిల్లా యుద్ధతంత్రంలో కొత్త ఎత్తుగడల అమలుకు శ్రీకారం
» వెలుగులోకి వచ్చిన మావోయిస్టు కేంద్ర కమిటీ డాక్యుమెంట్

ఈ కబురు:గతేడాది కాలంలో సానుభూతిపరుడి నుంచి జనరల్ సెక్రటరీ నంబాల కేశవరావు వరకు మొత్తం 357 మంది మావోయిస్టులు చనిపోయారు. మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ (సీసీ) పేరిట గత జూన్ 23న రాసిన 22 పేజీల డాక్యుమెంట్‌లో ఈ వివరాలు స్పష్టంగా ఉన్నాయి. ఈ డాక్యుమెంట్ మంగళవారం వెలుగులోకి వచ్చింది. అందులోని వివరాల ప్రకారం...బూటకపు ఎన్‌కౌంటర్లలో 80 మంది చనిపోయారని,

తరువాయి3లో

ఈ-కబురు

16- 07 -2025
బుధవారం
e-kaburu.com

మొదటి పేజీ తరువాయి


# భూమిపై దిగిన శుభాంశు శుక్లా.. యాక్సియం4 మిషన్ విజయవంతం



ఈ కబురు: న్యూఢిల్లీ: భారత అంతరిక్ష చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన అద్భుతమైన అధ్యాయానికి ఘనమైన ముగింపు లభించింది. మన వ్యోమగామి, వాయుసేన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా 18 రోజుల అంతరిక్ష యాత్రను విజయవంతంగా ముగించుకుని అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి క్షేమంగా తిరిగొచ్చారు. ఆయనతో పాటు యాగ్జియం-4 మిషన్ బృందంలోని మరో ముగ్గురు వ్యోమగాములను తీసుకుని స్పేస్ ఎక్స్ డ్రాగన్ 'గ్రేస్'వ్యోమనౌక భారత కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం 4:45 గంటలకు ఐఎస్ఎస్ నుంచి విడివడి నింగి నుంచి నేలకేసి సుదీర్ఘయానం ప్రారంభించడం తెలిసిందే. 22.5 గంటల ప్రయాణం అనంతరం షెడ్యూల్ ప్రకారం అది మంగళవారం తెల్లవారుజామున 2.31 గంటలకు (భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:02కు) అమెరికాలో దక్షిణ కాలిఫోర్నియాలోని శాన్‌డీగో తీర సమీపంలో పసిఫిక్ సముద్ర జలాల్లో విజయవంతంగా దిగింది. తర్వాత కాసేపటికే ముందుగా అమెరికాకు చెందిన మిషన్ కెప్టెన్ పెగ్గీ వాట్సన్ డ్రాగన్ క్యాప్సూల్ నుంచి బయటికొచ్చారు. మిషన్ పైలట్‌గా వ్యవహరించిన 39 ఏళ్ల శుభాంశు, ఆ తర్వాత కొద్దినిమిషాలకే నిండైన చిరునవ్వుల నడుమ బయటికి వచ్చి దేశవాసులను ఉద్దేశించి చేతులూపుతూ అభివాదం చేశారు. అప్పటిదాకా దేశవ్యాప్తంగా టీవీ తెరలకు అతుక్కుపోయి ఉత్కంఠభరితంగా వీక్షించిన ప్రజలంతా పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు.భారత్‌మాతా కీ జై అంటూ ఆనందోత్సాహాలతో నినదించారు. శుభాంశు స్వస్థలమైన యూపీ రాజధాని లఖ్‌నవూలోనైతే సంబరాలు అంబరాన్నంటాయి. ఎవరిని చూసినా మిఠాయిలు పంచుకుంటూ, బాణసంచా కాలుస్తూ కన్పించారు. తనయుడు క్షేమంగా భూమికి తిరిగొచ్చిన క్షణాలను వీక్షించే క్రమంలో ఆయన తల్లిదండ్రులు ఆనందబాష్పాలు రాల్చారు. అమెరికాలోని ఫ్లోరిడాలో శుభాంశు భార్య కామ్నాది కూడా అదే పరిస్థితి! రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర మంత్రులు, విపక్ష నేతలు మొదలుకుని రాజకీయ తదితర రంగాల ప్రముఖులంతా శుభాంశును అభినందించారు.''చరిత్రాత్మక అంతరిక్ష యాత్రను విజయవంతంగా ముగించుకుని భూమికి తిరిగొచ్చిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను దేశవాసులందరితో కలిసి అత్యంత సాదరంగా స్వాగతిస్తున్నా''అంటూ మోదీ హర్షం వెలిబుచ్చారు. వైద్య పరీక్షలు తదితరాల అనంతరం శుభాంశు బృందాన్ని వారం రోజుల పాటు క్వారెంటైన్‌కు తరలించారు. ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన మానవసహిత అంతరిక్ష యాత్ర (గగన్‌యాన్)కు శుభాంశు ఐఎస్ఎస్ యానం భారీ ఊపునిచ్చింది. నాసా, ఇస్రో సంయుక్తంగా రూపొందించిన యాగ్జియం-4 మిషన్‌లో భాగంగా శుభాంశు, వాట్సన్‌తో పాటు స్లావోజ్ ఉజ్నాన్‌స్కీ విస్నియెవ్‌స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ) జూన్ 25న బయల్దేరి 26న ఐఎస్ఎస్ చేరడం తెలిసిందే. అక్కడ 18 రోజుల పాటు వారు వివిధ రకాలైన 60 ప్రయోగాలు నిర్వహించి తిరిగొచ్చారు. శుభాంశు అంతరిక్ష, ఐఎస్ఎస్ యాత్రపై ఇస్రో రూ.550 కోట్లు వెచ్చించింది. ఈ యాత్రలో ఆయన సాధించిన అనుభవం 2027 కల్లా సాకారం చేసుకోవాలని తలపెట్టిన గగన్‌యాన్ ప్రాజెక్టుకు ఎంతగానో ఉపకరించనుంది. విస్నియెవ్‌స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ) కూడా తమ దేశాల నుంచి ఐఎస్ఎస్‌లో అడుగుపెట్టిన తొలి వ్యోమగాములుగా నిలిచారు. తనయుడు క్షేమంగా తిరిగి రావాలని ప్రార్థిస్తూ డ్రాగన్ క్యాప్సూల్ భూమిని చేరేదాకా ఆయన తల్లి ఆశాదేవి సుందరకాండ పారాయణం చేస్తూ గడిపారు.ఇలా తిరిగొచ్చారు... శుభాంశు బృందాన్ని తీసుకుని భారత కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం 4:45 గంటలకు ఐఎస్ఎస్ నుంచి బయల్దేరిన డ్రాగన్ వ్యోమనౌక 22.5 గంటల పాటు ప్రయాణించి మంగళవారం భూమిని చేరింది. మధ్యాహ్నం 2:07 గంటలు: క్యాప్సూల్ భూ వాతావరణంలోకి ప్రవేశించే ముందు కక్ష్య నుంచి విడివడే ప్రక్రియ మొదలై 18 నిమిషాల పాటు కొనసాగింది. 2:27: సోలార్ ప్యానెళ్లు, రేడియేటర్లతో కూడిన ముందు భాగాన్ని క్యాప్సూల్ విజయవంతంగా వదిలించుకుంది. 2:33: తిరిగి క్యాప్సూల్ ముందు భాగాన్ని మూసివేసే ప్రక్రియ విజయవంతంగా జరిగింది. 2:43: గంటకు ఏకంగా 28 వేల కి.మీ. వేగంతో భూ వాతావరణంలో ప్రవేశించింది. ఆ రాపిడి ఫలితంగా ఏకంగా 1,600 నుంచి 1,900 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత పుట్టుకొచ్చింది. అంతటి వేడినీ డ్రాగన్ క్యాప్సూల్ తాలూకు హీట్ షీల్డ్ విజయవంతంగా తట్టుకుంది. 2:44: విపరీతమైన వేగం కారణంగా స్పేస్ ఎక్స్ గ్రౌండ్ స్టేషన్‌తో క్యాప్సూల్‌కు 11 నిమిషాల పాటు సంబంధాలు తెగిపోయాయి. అదే సమయంలో దాని వేగాన్ని తగ్గించే ప్రక్రియ మొదలైంది. 2:54: మళ్లీ సిగ్నల్స్ కలిశాయి. 2:59: భూమికి 5 కి.మీ. ఎత్తులో రెండు ప్యారాచూట్లు తెరుచుకుని వేగాన్ని చాలావరకు తగ్గించాయి. 3:00: 2 కి.మీ. ఎత్తులో ఉండగా మరో నాలుగు ప్యారాచూట్లు విచ్చుకోవడంతో క్యాప్సూల్ వేగం గంటకు 118 మైళ్లకు దిగివచ్చింది.''యాగ్జియం-4 మిషన్‌కు సారథ్యం వహించి సురక్షితంగా తిరిగొచ్చిన శుభాంశుకు, ఈ చరిత్రాత్మక మిషన్‌లో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు'' - రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము''ఐఎస్ఎస్‌లో అడుగుపెట్టిన తొలి భారతీయునిగా శుభాంశు సాధించిన ఘనత కోట్లాది మంది భారత యువత తమ కలలను నిజం చేసుకునేందుకు తిరుగులేని స్ఫూర్తిగా నిలిచింది. గగన్‌యాన్ ప్రాజెక్టు దిశగా ఈ యాత్ర ఓ తిరుగులేని మైలురాయి'' - ప్రధాని మోదీ రాకేశ్ శర్మ అనంతరం 41 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత అంతరిక్షంలో వెళ్లిన తొలి భారతీయునిగా శుభాంశు రికార్డు సృష్టించారు. ఐఎస్ఎస్‌లోకి అడుగు పెట్టిన తొలి భారతీయుడు కూడా ఆయనే. ఆయన అంతరిక్ష యాత్ర సాగిన తీరు... 2024లో యాగ్జియం-4 వాణిజ్య మిషన్‌ను ఇస్రో, నాసా సంయుక్తంగా ప్రకటించాయి. 2025 మొదట్లోనే ప్రయోగం జరగాల్సింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పదేపదే వాయిదా పడుతూ వచ్చింది. జూన్ 25న స్పేస్ ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్ ద్వారా యాగ్జియం-4 మిషన్ అంతరిక్షానికి బయల్దేరింది. 28 గంటల సుదీర్ఘ ప్రయాణం అనంతరం 26న విజయవంతంగా ఐఎస్ఎస్‌ను చేరింది. అక్కడ శుభాంశు బృందం 18 రోజుల పాటు గడిపింది. ఆయన పలు కీలక ప్రయోగాలు చేయడంతో పాటు ప్రధాని మోదీ, విద్యార్థులు, తన తల్లిదండ్రులతో సంభాషించారు. జూలై 13న శుభాంశు బృందం తిరుగు ప్రయాణ సన్నాహాలు మొదలయ్యాయి. ఐఎస్ఎస్‌లోని సహచరులు వారికి సాదరంగా వీడ్కోలు పలికారు. జూలై 14 సాయంత్రం డ్రాగన్ వ్యోమనౌకలో శుభాంశు బృందం తిరుగు పయనమైంది. జూలై 15 మధ్యాహ్నం 3:01 గంటలకు కాలిఫోర్నియా తీర సమీపంలో సురక్షితంగా దిగింది.

మొదటి పేజీ తరువాయి

# బనకచర్లపై చర్చ అవసరం లేదు: తెలంగాణ సర్కారు లేఖ



ఈ కబురు: తెలంగాణ, ఏపీ మధ్య జల వివాదాలపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ బుధవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన సమావేశం ఎజెండాలో గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును చేర్చడంపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అనుమతులు లేని ప్రాజెక్టుపై చర్చ అసమంజసమని స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టుపై చర్చించాల్సిన అవసరం లేనేలేదని, వెంటనే ఎజెండాను సవరించాలని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రాసిన ఈ లేఖలో బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణకు ఉన్న అభ్యంతరాలన్నింటినీ సీఎస్ ప్రస్తావించారు. బనకచర్లే సింగిల్ ఎజెండాగా ఏపీ ప్రతిపాదన కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డితో ఈ సమావేశం జరగనుంది. అయితే ఈ భేటీ సింగిల్ (ఏకైక) ఎజెండాగా బనకచర్లపై మాత్రమే చర్చించాలని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. దీంతో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఏపీ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ లేఖ రాసింది. తెలంగాణ చేసిన పలు ప్రతిపాదనలను ఎజెండాలో చేర్చాలని కోరింది. కృష్ణా బేసిన్‌లోని తెలంగాణ పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులు, నీటి కేటాయింపులు, గతంలో కేంద్రం ఇచ్చిన హామీ ప్రకారం పాలమూరు, డిండి ప్రాజెక్టులకు జాతీయ ప్రాజెక్టులుగా గుర్తింపు అంశాన్ని ఎజెండాలో చేర్చి చర్చించాలని ఇప్పటికే కేంద్రాన్ని రాష్ట్ర సర్కారు కోరింది. అలాగే తుమ్మిడిహెట్టి వద్ద ప్రతిపాదించిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు 80 టీఎంసీల నీటి కేటాయింపుతో పాటు ఏబీఐపీ పథకం కింద సాయం, గోదావరిపై ఇచ్చంపల్లి వద్ద 200 టీఎంసీల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులు, నిధుల కేటాయింపు వంటి అంశాలను చేర్చాలని విజ్ఞప్తి చేసింది. తాజాగా ఇప్పుడు కూడా ఈ అంశాలపైనే చర్చించాలని సీఎస్ స్పష్టం చేశారు.

**ఆ సంస్థల విశ్వసనీయత దెబ్బతింటుంది..**

బనకచర్ల ప్రాజెక్టుపై గోదావరి బోర్డు, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), కేంద్ర పర్యావరణ శాఖలోని నిపుణుల మదింపు కమిటీ తీవ్ర అభ్యంతరాలు తెలపడాన్ని సీఎస్ గుర్తు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా, చట్టాలను, ట్రిబ్యునల్ తీర్పులన్నింటినీ ఉల్లంఘిస్తూ చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించాల్సిన అవసరం లేనేలేదని తేల్చి చెప్పారు. ఇలాంటి చర్యలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఏపీ సమర్పించిన ప్రీ ఫీజబిలిటీ రిపోర్టును కేంద్ర పర్యావరణ శాఖ పరిధిలోని నిపుణుల కమిటీ తిరస్కరించిన విషయాన్ని ప్రస్తావించారు. సీడబ్ల్యూసీ కూడా ఈ రిపోర్టును తిరస్కరించాలని కోరారు. డీపీఆర్ సమర్పించకుండా, టెండర్లు పిలవకుండా ఏపీని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు.
పరీవాహక ప్రాంతంలోని ఇతర రాష్ట్రాలతో సంప్రదింపులు జరపకుండా, అంగీకారం తీసుకోకుండా, గోదావరి ట్రిబ్యునల్ తీర్పు, ఏపీ పునర్విభజన చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఏపీ ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుతో రాష్ట్రాలకు ట్రిబ్యునల్ జరిపిన నీటి కేటాయింపుల్లో మార్పులు చోటు చేసుకుంటాయి. ప్రాజెక్టుల నిర్వహణలో సైతం మార్పులు చోటు చేసుకుంటాయి. ఏకపక్షంగా 200 టీఎంసీలను తరలించాలని చేసిన ప్రతిపాదనతో పోలవరం ప్రాజెక్టు ఆపరేషన్ షెడ్యూల్‌లో మార్పులు జరగడంతో పాటు తెలంగాణ నీటి హక్కులకు విఘాతం కలుగుతుంది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ప్రాజెక్టుకు అనుమతుల జారీకి సీడబ్ల్యూసీ, గోదావరి బోర్డు, కృష్ణా బోర్డు, అపెక్స్ కౌన్సిల్ నుంచి క్లియరెన్స్‌లు అవసరం కాగా, బనకచర్ల ప్రాజెక్టుకు ఇవేమీ లేవు. ఏపీ సమర్పించిన ప్రీ ఫీజబిలిటీ రిపోర్టులో కీలకమైన సమాచార లోపాలున్నాయి. నీటి లభ్యత, సాంకేతిక సమాచారం లోపించింది. పోలవరం ప్రాజెక్టుతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో ఏర్పడే ముంపుపై ఇప్పటికే న్యాయస్థానాల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమయంలో ఈ ప్రాజెక్టును ఎలా చేపడతారు? ఈ ప్రాజెక్టు తెలంగాణకు హక్కుగా రావాల్సిన నీటి వాటాలను హరిస్తుంది. ప్రధానంగా కరువు పీడిత ప్రాంతాలపై దుష్ప్రభావం చూపుతుంది. అన్ని ప్రక్రియలూ పూర్తైన తర్వాతే చర్చించాలి చట్టబద్ధంగా రావాల్సిన అన్ని అనుమతులు, అంతర్రాష్ట్ర సంప్రదింపులు, అభ్యంతరాల పరిష్కారం వంటి ప్రక్రియలు పూర్తైన తర్వాతే ఈ ప్రాజెక్టుపై అయినా, ఏ సమావేశంలోనైనా చర్చ జరగాలి. ఆ తర్వాతే ప్రాజెక్టును ఆమోదించాలి. బనకచర్ల ద్వారా తరలించనున్న 200 టీఎంసీల గురించి పోలవరం ప్రాజెక్టు డీపీఆర్‌లో ప్రస్తావన లేదు. నీటి లభ్యత, అంతర్రాష్ట్ర ప్రభావాలపై సమగ్ర అధ్యయనంతో పాటు ట్రిబ్యునల్ తీర్పులను నికచ్చిగా అమలు చేస్తేనే ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉంటుందని పోలవరం ప్రాజెక్టు ఆథారిటీ (పీపీఏ) స్పష్టం చేసింది. బనకచర్ల ప్రాజెక్టుతో పోలవరం ప్రాజెక్టు ఆపరేషన్ షెడ్యూల్, గోదావరి ట్రిబ్యునల్ తీర్పు, 1980 ఏప్రిల్ 2న జరిగిన అంతర్రాష్ట్ర ఒప్పందం అమలు తీరులో మార్పులు చోటుచేసుకుంటాయని గోదావరి బోర్డు అభ్యంతరం తెలిపింది. ఎలాంటి మార్పులకైనా పరీవాహకంలోని అన్ని రాష్ట్రాల నుంచి తప్పనిసరిగా రాతపూర్వకంగా సమ్మతి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. గోదావరి జలాల బట్వాడా విషయంలో ఏపీ, తెలంగాణ మధ్య ఎలాంటి ఒప్పందం లేదని కూడా తెలిపింది. 80 టీఎంసీలకు మించి జలాలను ఇతర బేసిన్లకు మళ్లిస్తే బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలకు వాటాలు ఇవ్వాలని కృష్ణా, గోదావరి ట్రిబ్యునల్ తీర్పులు స్పష్టం చేస్తున్నాయని తెలిపింది. గోదావరి ట్రిబ్యునల్ పరీవాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు కేటాయించిన నికర జలాల కోటాలను పూర్తిగా వాడుకోవడానికి ఆయా రాష్ట్రాల్లో ప్రాజెక్టులను నిర్మించిన తర్వాతే బనకచర్ల ప్రాజెక్టుకు ప్రతిపాదించిన 200 టీఎంసీల లభ్యతపై స్పష్టత వస్తుందని సీడబ్ల్యూసీ తేల్చి చెప్పింది ప్రాజెక్టు గోదావరి ట్రిబ్యునల్ తీర్పుకు విరుద్ధమని పేర్కొంటూ బనకచర్ల ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు జారీ చేయడానికి కేంద్ర పర్యావరణ శాఖ నిరాకరించిన విషయాన్ని సైతం లేఖలో తెలంగాణ ప్రస్తావించింది. అన్ని రకాల అనుమతులు సాధించిన తర్వాతే పర్యావరణ అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలని కోరిందని తెలిపింది.

మొదటి పేజీ తరువాయి

# గవర్నర్ వద్దకు పంచాయతీ ఆర్డినెన్స్ ఫైల్




ఈ కబురు: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేగం పెంచింది. దీనికి సంబంధించిన ఫైల్‌ను గవర్నర్ వద్దక పంపింది. దీనిలో భాగంగా పంచాయతీ ఆర్డినెన్స్ ఫైల్‌ను మంగళవారం(జూలై 15వ తేదీ) మంత్రి, సీఎం సంతకం చేసి రాజ్‌భవన్‌కు పంపింది ప్రభుత్వం. 285(A) సెక్షన్ లో సవరణ చేస్తూ ముసాయిదాను రాజ్ భవన్‌కు పంపారు. ఎటువంటి లీగల్ చిక్కులు రాకండా ముసాయిదా డ్రాఫ్‌డ్‌ను గవర్నర్‌కు పంపించింది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం. గవర్నర్ నుంచి ఆమోదం రాగానే ఆర్డినెన్స్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది ప్రభుత్వం. ఒకవైపు స్థానిక సంస్థల ఎన్నికలను మూడు నెలల్లో నిర్వహించాలని ఇప్పటికే హైకోర్టు డెడ్‌లైన్ విధించిన నేపథ్యంలో రిజర్వేషన్ల ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో భాగంగానే గవర్నర్ ఆమోదంతో పంచాయతీరాజ్ సవరణ చట్టం వీలైనంత త్వరగా అమల్లోకి తీసుకు రావడానికి యత్నాలు చేస్తోంది ప్రభుత్వం.

మొదటి పేజీ తరువాయి

# ప్రపంచ దేశాలతోనే పోటీ



ఈ కబురు: రాష్ట్రాలతో కాదు.. ప్రపంచ దేశాలతో పోటీ పడాలనేదే తమ ప్రభుత్వ ప్రయత్నమని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇందుకోసం అధునాతన పారిశ్రామిక విధానాలు తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్ రూపుదిద్దుకుంటోందని, దేశంలో నే 33% టీకాలు, బల్క్ డ్రగ్స్‌లో 43% ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతున్నాయని చెప్పారు.రాబోయే రోజుల్లో హైదరాబాద్ డేటా సిటీగా మారనుందని, తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.3 లక్షల 28 వేల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. మంగళవారం శామీర్‌పేట జీనోమ్ వ్యాలీలో ఐకార్ బయోలాజిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ విస్తరణలో భాగంగా 1.75 లక్షల చదరపు అడుగుల్లో నిర్మించనున్న కొత్త ప్లాంట్‌కు మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు.

**జీనోమ్ వ్యాలీతో మంచి గుర్తింపు**

దేశంలో జీనోమ్ వ్యాలీలోనే టీకాల ఉత్తత్తి జరుగుతోందని, జీనోమ్ వ్యాలీ తెలంగాణకు మంచి గుర్తింపు తీసుకొచ్చిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. కోవిడ్ సమయంలో జీనోమ్ వ్యాలీ నుంచి ప్రపంచ దేశాలకు టీకాను ఎగుమతి చేసిన ఘనత ఇక్కడి పారిశ్రామికవేత్తలదని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక విధానాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగానే తమ నిర్ణయాలు ఉన్నాయన్నారు. తమ ప్రభుత్వం మరింత సరళమైన విధానాలతో ముందుకెళ్తోందని, నూతన పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తోందని, వారికి అవసరమైన సహకారాన్ని అందిస్తోందని చెప్పారు. రాబోయే పదేళ్లలో తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా, తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తెలంగాణ: మంత్రి శ్రీధర్‌బాబు తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. ఈ లక్ష్య సాధనలో ఐకార్ రూపంలో మరో అడుగు ముందుకు పడిందని, కొత్తగా 800 మందికి ఉద్యోగాలు లభించనున్నాయని తెలిపారు. హైదరాబాద్-నాగ్‌పూర్, హైదరాబాద్-బెంగళూరు కారిడార్లలో ప్రత్యేకంగా ఫార్మా విలేజెస్‌ను అభివృద్ధి చేయబోతున్నామని చెప్పారు. లైఫ్ సైన్సెస్ రంగంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడంపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని, ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు..

**యువతకు ఉద్యోగాలే లక్ష్యం: మంత్రి వివేక్**

యువతకు ఉద్యోగాల కల్పన కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి చెప్పారు. అధిక ఉద్యోగాల కల్పనతో నిరుద్యోగాన్ని తగ్గించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఎక్కువ పరిశ్రమలను స్థాపించడం ద్వారా ఎక్కువ ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ మను చౌదరి, పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# రష్యా నడిబొడ్డుపై నిప్పులు కురిపించగలవా?



ఈ కబురు: వాషింగ్టన్: దీటైన అస్త్రశస్త్రాలు అందిస్తే మాస్కోను కొట్టగలవా? రష్యాపై భీకరంగా దాడిచేయగలవా? అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూటి ప్రశ్న వేశారు. జూలై నాలుగో తేదీన జెలెన్‌స్కీకి ఫోన్‌చేసిన మాట్లాడిన సందర్భంగా ట్రంప్, వొలదిమిర్ జెలెన్‌స్కీల మధ్య జరిగిన సంభాషణ తాలూకు విశేషాలను తాజాగా అంతర్జాతీయ మీడియా బయటపెట్టింది. ఉక్రెయిన్ రాజధాని నగరం కీవ్‌పై క్షిపణుల వర్షం కురిపిస్తూ తీవ్ర నష్టం చేకూరుస్తున్న రష్యాకు సైతం అదే స్థాయిలో ఆస్తి, ప్రాణ నష్టం కల్గించాలని జెలెన్‌స్కీకి ట్రంప్ సూచించినట్లు తెలుస్తోంది.ఇరునేతల సంభాషణ వివరాలను కొన్ని అత్యున్నత వర్గాలు వెల్లడించాయని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. '' చూడు వొలదిమిర్.. నువ్వు రష్యా రాజధాని మాస్కో నగరంపై క్షిపణులతో దాడి చేయగలవా?'' అని ట్రంప్ ప్రశ్నించగా.. '' తప్పకుండా. మీరు సరైన మిస్సైళ్లు ఇస్తే దాడి చేసి చూపిస్తా'' అని జెలెన్‌స్కీ హామీ ఇచ్చారు. '' మీకు కావాల్సిన సుదీర్ఘ శ్రేణి క్షిపణులను అందిస్తాం. రష్యాలోని సెయింట్‌పీటర్స్‌బర్గ్‌ను ధ్వంసంచేయగలరా?'' అని ట్రంప్ ప్రశ్నించగా.. '' ఆ స్థాయిలో దాడికి సరిపడా ఆయుధాలు సమకూరిస్తే తప్పకుండా దాడిచేస్తాం'' అని జెలెన్‌స్కీ మాటిచ్చారు. ''దాడుల్లో రక్తమోడుతూ ఉక్రెయిన్‌వాసులు పడుతున్న బాధను రష్యన్లు అనుభవించాలి. మీ దాడులతో వాళ్లకూ నొప్పి తెలిసిరావాలి'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.ఉక్రెయిన్‌తో సయోధ్య కుదుర్చుకోవాలని, లేదంటే 50 రోజుల్లోపు సుంకాల సుత్తితో మోదుతానని రష్యాను ట్రంప్ హెచ్చరించిన మరుసటి రోజే ఈ సంభాషణల అంశం తెరమీదకు రావడం గమనార్హం. శాంతి ఒప్పందం చేసుకోండని ఎంతమొత్తుకున్నా రష్యా వినిపించుకోవట్లేదని, సహనం నశించి ట్రంప్ ఇలా జెలెన్‌స్కీని దాడులు చేయగలవా? అని ప్రశ్నించారని తెలుస్తోంది. అయితే సంభాషణల వార్తపై అటూ శ్వేతసౌధంగానీ, ఇటు ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయంగానీ స్పందించలేదు.నాటో కూటమి ప్రధాన కార్యదర్శి మార్క్ రుట్టేతో కలిసి శ్వేతసౌధంలో ట్రంప్ సోమవారం మీడియాతో మాట్లాడారు. '' పుతిన్ అంత సులభంగా లొంగే మనిషి కాడు. మన నేతలనే మభ్యపెట్టాడు. క్లింటన్ మొదలు జార్జ్ బుష్, ఒబామా, బైడెన్‌దాకా అమెరికా అధ్యక్షులను తన మాటలతో మభ్యపెట్టాడు. నేను వాళ్లలాగా ఫూల్‌ను కాబోను. బిలియన్ల డాలర్ల విలువైన అత్యాధునిక ఆయుధాలను ఉక్రెయిన్‌కు సరఫరా చేస్తా. నాటో సభ్యదేశాలు ఆర్డర్ ఇచ్చిన 17 గగనతల రక్షణ వ్యవస్థ మిస్సైల్ లాంచర్లన్నీ ఉక్రెయిన్‌కు పంపిస్తాం'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

# నీటిపారుదలశాఖ మాజీ ఈఎన్‌సీ మురళీధర్‌రావు అరెస్ట్

ఈ కబురు: హైదరాబాద్: నీటిపారుదలశాఖ మాజీ ఈఎన్‌సీ (ఇంజినీర్ ఇన్ చీఫ్) మురళీధర్‌రావు అరెస్టయ్యారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు ఆయన్ను అరెస్ట్ చేశారు. మంగళవారం ఉదయం ఏసీబీ అధికారులు ఆయన్ను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. మురళీధర్‌రావుతో పాటు ఆయన బంధువుల ఇళ్లలో అధికారులు సోదాలు నిర్వహించారు. మొత్తం 11 చోట్ల తనిఖీలు జరిగాయి. వివిధ పత్రాలను ఏసీబీ అధికారులు పరిశీలించి భారీగా ఆస్తులను గుర్తించారు. హైదరాబాద్ శివారులో 11 ఎకరాల భూమి, నాలుగు ఇళ్ల స్థలాలు, మోకిలలో 6,500గజాల స్థలం గుర్తించారు. కొండాపూర్‌లో విల్లా.. బంజారాహిల్స్, యూసఫ్‌గూడ, బేగంపేట, కోకాపేట ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్ ప్లాట్లు ఉన్నట్లు తేలింది. కరీంనగర్, హైదరాబాద్‌లో వాణిజ్య సముదాయాలు, జహీరాబాద్‌లో సోలార్ పవర్ ప్రాజెక్ట్, వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లను గుర్తించారు. మురళీధర్‌రావు ఉమ్మడి రాష్ట్రంలోనే పదవీవిరమణ పొందారు. తర్వాత ఆయన పదవీ కాలాన్ని 13 ఏళ్ల పాటు పొడిగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కొన్నాళ్లు పదవిలో ఉన్నారు. మేడిగడ్డపై విజిలెన్స్ నివేదిక తర్వాత మురళీధర్‌రావును ప్రభుత్వం తొలగించింది.



# గతేడాది 357 మంది మావోల మృతి



ఈ కబురు:గతేడాది కాలంలో సానుభూతిపరుడి నుంచి జనరల్ సెక్రటరీ నంబాల కేశవరావు వరకు మొత్తం 357 మంది మావోయిస్టులు చనిపోయారు. మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ (సీసీ) పేరిట గత జూన్ 23న రాసిన 22 పేజీల డాక్యుమెంట్‌లో ఈ వివరాలు స్పష్టంగా ఉన్నాయి. ఈ డాక్యుమెంట్ మంగళవారం వెలుగులోకి వచ్చింది. అందులోని వివరాల ప్రకారం...బూటకపు ఎన్‌కౌంటర్లలో 80 మంది చనిపోయారని, మొత్తంగా చనిపోయిన వారిలో 136 మంది మహిళలు ఉన్నారని, ఎదురుకాల్పులు కాకుండా అనారోగ్య కారణాలతో నలుగురు, ప్రమాదంలో మరొకరు మృతి చెందారు. నలుగురు సెంట్రల్ కమిటీ సభ్యులు, 16 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, 23 మంది జిల్లా కమిటీ సభ్యులు, 83 మంది ఏరియా కమిటీ, 138 మంది పార్టీ సభ్యులు, పీఎల్‌జీఏ 17, ఇతర విభాగాల వారు 40, గుర్తించని మృతులు 36 మంది ఉంటారని వివరించింది. వీరి త్యాగాలను స్మరించుకుంటూ ఈ నెల 28 నుంచి ఆగస్టు 3 వరకు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది. నక్సల్బరీ విప్లవ పోరాటం మొదలైన తర్వాత ఆపరేషన్ కగార్‌తో ఏడాది వ్యవధిలోనే పెద్ద సంఖ్యలో సెంట్రల్, స్టేట్ కమిటీ సభ్యులను కోల్పోవడంతో తీవ్ర నష్టం జరిగిందని పార్టీ సెంట్రల్ కమిటీ పేర్కొంది. గతేడాది ఏప్రిల్‌లో జరిగిన కాంకేర్ ఎన్‌కౌంటర్ (29 మంది మావోయిస్టులు చనిపోయారు) తర్వాత సగటున ప్రతీ 20 రోజులకు ఒక భారీ ఎన్‌కౌంటర్ జరుగుతోందని, ఈ ఘటనల్లో కనిష్టంగా 10 నుంచి గరిష్టంగా 35 మంది వరకు మావోయిస్టులు చనిపోయారని తెలిపింది. 20 కిలోమీటర్ల వలయాకారంలో వేలాది మంది భద్రతాదళాలు చుట్టుముడుతూ తమపై దాడులు చేస్తున్నాయని, ఆధునిక ఆయుధాలు, టెక్నాలజీ గల భద్రతా దళాలను తమ కేడర్ ప్రాణాలకు తెగించి ఎదుర్కొంటోందని ఆ డాక్యుమెంట్‌లో పేర్కొంది.

**నిజాలు దాస్తున్నారు**

ప్రతీ ఎదురుకాల్పుల ఘటనలో భద్రతాదళాల వైపు కూడా పది మందికి మించి జవాన్లు చనిపోతున్నారని సెంట్రల్ కమిటీ తెలిపింది. తమకున్న అంచనా ప్రకారం ప్రతిదాడుల్లో 70 మంది జవాన్లు చనిపోగా, 130 మంది తీవ్రంగా గాయపడి ఉంటారని అభిప్రాయపడింది. అయితే ఈ విషయాన్ని దాచి పెడుతూ కేవలం మావోయిస్టుల మరణాల లెక్కలనే పాలకులు బయటకు వెల్లడిస్తున్నారని విమర్శించింది. దీర్ఘకాలిక సాయుధ పోరాటంలో ఎత్తుపల్లాలు సహజమేనని వివరణ ఇచ్చింది. అంతర్జాతీయ వ్యవహారాలపై కూడా ఈ డాక్యుమెంట్‌లో కేంద్ర కమిటీ తమ అభిప్రాయాలను తెలిపింది.

**అనువైన సమయం కోసం**

గెరిల్లా యుద్ధతంత్రంలో అనుసరించాల్సిన వ్యూహాలను సరైన రీతిలో అమలు చేయనందుకే పార్టీకి నష్టాలు పెరిగాయని సీసీ వివరణ ఇచ్చింది. 2024 ఆగస్టులో పొలిట్‌బ్యూరో తీసుకున్న నిర్ణయాలను అమల్లోకి తీసుకురాబోతున్నట్లు పేర్కొంది. వర్గ పోరాటాన్ని వికేంద్రీకరించి అటవీ, గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో పార్టీని విస్తరించాలని సీసీ స్పష్టంగా పేర్కొంది. పెరిగిన నిర్బంధం, పార్టీకి వరుసగా జరుగుతున్న నష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈ విస్తరణ వీచేగాలిలా, ప్రవహించే నీరులా ఉండాలని కేడర్‌కు కేంద్ర కమిటీ సూచించింది. శత్రువు బలంగా ఉన్నప్పుడు ఎదురుగా నిలిచి పోరాటం చేయనక్కర్లేదని, అనువైన సమయం కోసం ఎదురుచూడాలని ఆదేశించింది. శాంతి చర్చలు జరపాలంటూ 9 రాష్ట్రాల నుంచి డిమాండ్ రావడం ఇటీవల కాలంలో కనిపించిన సానుకూల పరిణామమని ఆ పార్టీ పేర్కొంది. 2026 మార్చి 31 నాటికి మావోయిస్టులను అంతం చేస్తామని కేంద్రం చేసిన ప్రకటన ఎప్పటికీ నెరవేరబోదని ధీమా వ్యక్తం చేసింది.

# నిమిష ప్రియకు మరణశిక్ష తప్పేనా? 'బ్లడ్ మనీ'పై మత గురువుతో

ఈ కబురు: యెమెన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటున్న కేరళ నర్సు నిమిష ప్రియకు మరికొన్ని గంటల్లో శిక్ష అమలుచేయనున్నారు. దీన్ని ఆపేందుకు ఆమె కుటుంబానికి ఉన్న ఏకైక అవకాశం 'బ్లడ్ మనీ (క్షమాధనం)'. దీనిపై ఇప్పటికే బాధిత కుటుంబంతో చర్చలు జరుపుతున్నారు. తాజాగా భారత్‌కు చెందిన ఓ ప్రముఖ మత గురువు కూడా ఈ ప్రయత్నాల్లో భాగమయ్యారు. నిమిష ప్రియ ను శిక్ష నుంచి తప్పించేందుకు మత గురువు కాంతాపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ బాధిత కుటుంబంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆమె తరఫు న్యాయవాది వెల్లడించారు.''ఈ కేసులో గ్రాండ్ ముఫ్తీ ఆఫ్ ఇండియా అబూబకర్ ముస్లియార్ మధ్యవర్తిత్వం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. బాధిత కుటుంబంతో పాటు యెమెన్ స్థానిక అధికారులు, అక్కడి మత పెద్దలతో ఆయన మాట్లాడుతున్నారు. బ్లడ్ మనీని అంగీకరించేలా బాధిత కుటుంబాన్ని ఒప్పించేందుకు మేం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం. నిమిషకు శిక్ష పడకుండా చేయగలిగే మార్గం ఇదొక్కటే'' అని న్యాయవాది శుభాష్ చంద్రన్ మీడియాకు వెల్లడించారు.హూతీల పాలనలో ఉన్న యెమెన్ చట్టాల ప్రకారం.. నేరం రుజువైన తర్వాత కూడా దోషిని బాధిత కుటుంబం క్షమిస్తే శిక్ష తప్పుతుంది. ఆ కుటుంబం బ్లడ్‌మనీకి అంగీకరిస్తే అది సాధ్యమవుతుంది. ఈ విషయంలో నిమిష కుటుంబం.. బాధితులతో సంప్రదింపులు సాగిస్తూనే ఉంది. గతేడాది నిమిష తల్లి ప్రేమకుమారి యెమెన్ వెళ్లారు. తనకున్న పరిచయాల ఆధారంగా బ్లడ్‌మనీ ఇచ్చి, తన కుమార్తెను కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేశారు. ప్రియ కుటుంబం మిలియన్ డాలర్లు (రూ.8.6 కోట్లు)ను బాధిత కుటుంబానికి ఇచ్చేందుకు సిద్ధమైంది. కానీ, ఇందుకు వారు అంగీకరించట్లేదని సమాచారం. మరోవైపు, ఆమెను రక్షించేందుకు భారత ప్రభుత్వం సాధ్యమైనన్ని ప్రయత్నాలు చేస్తోందని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి సోమవారం సుప్రీంకోర్టుకు తెలియజేశారు. ఉరిశిక్షను ఆపేందుకు భారత్‌కు మార్గాలేమీ కనిపించడం లేదని తెలియజేశారు. బ్లడ్ మనీని దౌత్యపరంగా గుర్తించలేదని, అందుకే దాన్ని అధికారిక స్థాయిలో చర్చించలేమని స్పష్టంచేశారు. భారత్‌యెమెన్‌ల మధ్య దౌత్యపరమైన సంబంధాలు కూడా లేకపోవడంతో, ఈ విషయంలో ప్రభుత్వం చేయగలిగిందేమీ లేదన్నారు. దీంతో ఇప్పుడు ఆమె ఉరిశిక్షపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.



# గోదావరిని కావాలనే ఎండబెడుతున్నారు



ఈ కబురు:'గోదావరిని కావాలనే ముఖ్యమంత్రి ఎండబెడుతున్నారు. కాళేశ్వరం సాక్షిగా నేను చెప్పిన మాటలకు కట్టుబడి ఉన్నాను. కేసీఆర్‌కు మూడు రోజులు టైమ్ ఇస్తే కన్నెపల్లి పంప్‌హౌజ్ మోటార్లు ఆన్‌చేసి చూపిస్తాం. ఏ పంప్‌హౌజ్ దగ్గరైనా చర్చ పెడదాం. కాళేశ్వరంలో అన్నీ బాగానే ఉన్నాయి. ఏవీ కూలలేదని నిరూపిస్తాం. రైతుల సమక్షంలో చర్చకు ముఖ్యమంత్రి వచ్చినా మంత్రి వచ్చినా నేను సిద్ధం' అని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 'కేసీఆర్ హయాంలో రేషన్ కార్డులు ఇవ్వలేదని సీఎం అబద్ధాలు మాట్లాడారు. 6.47 లక్షల రేషన్ కార్డులను కేసీఆర్ ప్రభుత్వంలో పంచాం. గతంలో కేసీఆర్ జిల్లా పర్యటనలకు వచ్చినపుడు కొత్త కార్యక్రమాలు ప్రకటించేవారు. తుంగతుర్తి సభలో సీఎం తిట్లు తప్ప ఏమీ ఇవ్వలేదు. నా ఆస్తులు, రేవంత్ ఆస్తుల గురించి మీడియానే విచారణ జరపాలి' అని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ మాట్లాడుతూ..భారాస హయాంలో తుంగతుర్తి నియోజకవర్గానికి గోదావరి నీళ్లు ఇచ్చామని, సాగర్ నీళ్లు తమకు రాకుండా ఖమ్మం తీసుకెళ్తుంటే మంత్రి ఉత్తమ్ మాట్లాడటం లేదని తెలిపారు.

# ఏదో ఒకటి చేయాల్సిందే.. సోషల్ మీడియా అభ్యంతరకర పోస్టులపై సుప్రీం



ఈ కబురు:సోషల్ మీడియాలో కొందరు యూట్యూబర్లు, స్టాండప్ కమెడియన్లు, కళాకారులు ఇష్టానుసారం అభ్యంతరకర పోస్టులు చేస్తున్నారని సుప్రీం కోర్టు (Supreme Court) ఆగ్రహం వ్యక్తం చేసింది. అలాంటి పోస్టుల కట్టడికి తప్పనిసరిగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. సోషల్ మీడియాలో ఏం చేసినా.. ఏం చెప్పినా చెల్లిపోతుందనే ధోరణి పలువురిలో కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి ఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్నాయని మండిపడింది. ప్రధాని నరేంద్రమోదీ, ఆరెస్సెస్‌పై వేసిన కార్టూన్ అభ్యంతరకరంగా ఉండటంతో తనపై నమోదైన కేసులో అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కార్టూనిస్టు హేమంత్ మాలవీయ వేసిన పిటిషన్‌పై విచారణ సమయంలో సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. భావ ప్రకటనా స్వేచ్ఛను దుర్వినియోగం చేయవద్దని హెచ్చరిస్తూ.. కార్టూనిస్టు హేమంత్ మాలవీయకు అరెస్టు నుంచి సుప్రీం కోర్టు రక్షణ కల్పించింది. అయితే ఇదే విధంగా సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులను షేర్ చేస్తే..చట్టంప్రకారం అతడిపై చర్యలు తీసుకునే అధికారం రాష్ట్రానికి ఉందని జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం హెచ్చరించింది. ప్రధాని నరేంద్రమోదీ, ఆరెస్సెస్‌పై వేసిన కార్టూన్ అభ్యంతరకరంగా ఉండటంతో కార్టూనిస్టు హేమంత్ మాలవీయపై న్యాయవాది, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త వినయ్ జోషి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదయ్యింది. మాలవీయ సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన విషయాలను అప్‌లోడ్ చేయడం ద్వారా హిందువుల మతపరమైన మనోభావాలను దెబ్బతీశారని జోషి ఆరోపించారు. ఈ కేసులో అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ.. హేమంత్ మాలవీయ మధ్యప్రదేశ్ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేయగా.. న్యాయస్థానం దానిని తోసిపుచ్చడంతో ఆయన సుప్రీంను ఆశ్రయించారు.

# సీపీఐ నాయకుడిని హతమార్చడం దుర్మార్గమైన చర్య: ఎంఎల్ఏ కూనంనేని



ఈ కబురు:ఎల్బీనగర్ కు చెందిన సిపిఐ నాయకులు చందు నాయక్ దుండగుల చేతిలో మృతి చెందడం పట్ల సిపిఐ రాష్ట్ర సమితి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. హత్య చేసిన దుండగులను గుర్తించి తక్షణమే అరెస్టు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాలం మారుతున్నా ఇప్పటికీ ఇలాంటి దారుణాలకు పాల్పడితే వారికి సమాజంలో స్థానం ఉండదని తెలిపారు. చందు నాయక్ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. చందు నాయక్ మృతి పట్ల మాజీ ఎంఎల్ఏ చాడ వెంకట్ రెడ్డి సంతాపాన్ని తెలిపారు. దుండగుల చేతిలో మృతి చెందడం బాధాకరమని వారు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.చందు నాయక్ పేద ప్రజల కోసం పని చేయాలని తపనతో విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు పార్టీలో చేరి దిల్ సుఖ్ నగర్, చైతన్యపురి ప్రాంతంలో నివాసం ఉంటూ హైదరాబాదులో గూడు లేని పేదల కోసం గుడిసెలు వేయించి భూ పోరాటం చేశారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాస రావు తెలిపారు. చందు నాయక్ భారత కమ్యూనిస్టు పార్టీలో నాయకునిగా అంచ లంచలుగా ఎదిగారని, అలాంటి సమయంలో మంగళవారం ఉదయం 7:30 గంటలకు దుర్మార్గులు కంట్లో కారం చల్లి కాలుపులు జరపడంతో అక్కడికక్కడే మృతి చెందారని, ఆయన మరణం సీపీఐ పార్టీకి, సమాజానికి తీరని లోటు అని అన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# రైతులకు బ్యాంకులు రుణసాయం పెంచాలి



ఈ కబురు:రాష్ట్రంలో రైతులకు బ్యాంకులు పంట రుణసాయం పెంచాలని, వ్యవసాయానుబంధ రంగాలను ప్రోత్సహించాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. పెద్దపెద్ద సంస్థలు భారీఎత్తున రుణాలు తీసుకొని రూ.వేల కోట్లను ఎగ్గొడుతున్నాయని, రైతులు ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నప్పటికీ.. తాము తీసుకున్న రుణాలను 100 శాతం పూర్తిగా చెల్లిస్తూ నిజాయతీగా నిలుస్తున్నారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు(నాబార్డు) 44వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ''వ్యవసాయంలో, దాని అనుబంధ కార్యకలాపాలకు బ్యాంకుల నుంచి మరింత సాయం అందాలి. అగ్రి, హార్టి వర్సిటీలకు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ముందుకు రావాలి. నాబార్డును అవి ఆదర్శంగా తీసుకోవాలి. 30 మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సహకరించింది. ప్రభుత్వం నాబార్డుతో కలిసి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధిపథంలోకి తెస్తోంది'' అని మంత్రి చెప్పారు. సమావేశంలో సహకార కమిషనర్ సురేంద్రమోహన్, నాబార్డు తెలంగాణ సీజీఎం ఉదయ్‌భాస్కర్, టెస్కాబ్ ఛైర్మన్ ఎం.రవీందర్‌రావు, నాఫ్‌స్కాబ్ ఛైర్మన్ కె.రవీందర్‌రావు, ఎస్.ఎల్.బి.సి. ఛైర్మన్ రాధాకృష్ణన్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, యూబీఐ సీజీఎం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీసీబీలు, సహకార సంఘాలకు పురస్కారాలను అందజేశారు. ప్రాథమిక సహకార సంఘాలు బహుళ సేవలందించాలి రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు బహుళ సేవలను అందించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రస్తుత అవసరాలు, వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అవి దృక్పథం మార్చుకోవాలని, ముల్కనూర్ సొసైటీని ఆదర్శంగా తీసుకొని రైతులకు అన్నిరకాలుగా అండగా నిలవాలన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో రాష్ట్ర సహకార యూనియన్, జాతీయ సహకార అభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్‌సీడీసీ ప్రాంతీయ సంచాలకుడు శార్దూల్, సహకార యూనియన్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, టెస్కాబ్ అధ్యక్షుడు రవీందర్‌రావు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్‌బాబుతో ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ భేటీ



ఈ కబురు:డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో మంగళవారం ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్( బెంగళూరు), అడ్మినిస్ట్రేటర్ ఆఫ్ ది స్టేట్ మార్క్ లామీ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణఫ్రాన్స్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు సహా ఇరుపక్షాల మధ్య సహకారాన్ని పెంపొందించడం, వివిధ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై చర్చించారు. ఈ సమావేశంలో టీజీఐఐసీ ఎండీ శశాంక్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఇమ్రాన్ మాజీ భార్య రెహమ్ ఖాన్ కొత్త పార్టీ

ఈ కబురు:పాకిస్థాన్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. జర్నలిస్టు, పీటీఐ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ మాజీ భార్య రెహమ్ ఖాన్ కొత్త పార్టీని ప్రకటించారు. 'పాకిస్థాన్ రిపబ్లిక్ పార్టీ' పేరుతో దీన్ని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్న ఆమె.. ప్రజా సమస్యలను లేవనెత్తడంలో సామాన్యుడి గొంతుకగా నిలబడతానన్నారు.''గతంలో ఎప్పుడూ రాజకీయ పదవులు చేపట్టలేదు. ఓసారి ఒక్క వ్యక్తి (ఇమ్రాన్‌ను ఉద్దేశిస్తూ) కోసం పార్టీలో చేరా. కానీ ఈరోజు మాత్రం సొంతగా రాజకీయాల్లోకి ప్రవేశించా. ఇది కేవలం పార్టీ మాత్రమే కాదు..రాజకీయాలను సేవగా మార్చే ఉద్యమం'' అని రెహమ్ ఖాన్ వెల్లడించారు. దేశంలో ప్రస్తుత రాజకీయాలపై ప్రజల్లో పెరుగుతున్న నిరాశ నేపథ్యంలోనే పార్టీ స్థాపించానని, పాలకవర్గాన్ని సవాల్ చేయడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. కరాచీలో ప్రెస్ క్లబ్‌లో ఈ వివరాలు వెల్లడించిన ఆమె.. కష్టకాలంలో ఈ ప్రదేశం తనకు అండగా నిలిచిందన్నారు.2012 నుంచి ఇప్పటివరకు పాకిస్థాన్‌లో తాగునీరు, కనీస వసతులు కరవయ్యాయని రెహమ్ ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఇక ఆమోదయోగ్యం కాదన్న ఆమె.. అధికారం చేపట్టడం కాకుండా మార్పు కోసమే తమ పార్టీ పని చేస్తుందన్నారు. కుటుంబ రాజకీయాలపై విమర్శలు గుప్పిస్తూ.. ఎవ్వరి మద్దతు లేకుండానే తమ పార్టీ ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే పార్టీ మేనిఫెస్టోను విడుదల చేస్తామని ప్రకటించారు.

TATA CONSULTANCY SERVICES

## టీసీఎస్ వేరియబుల్ పే.. 70% మందికి నూరు శాతం అలవెన్స్

ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఏప్రిల్ జూన్ త్రైమాసికానికి గానూ ఉద్యోగులకు వేరియబుల్ పే అలవెన్స్‌ను ప్రకటించింది. మొత్తం ఉద్యోగుల్లో 70 శాతం మందికి నూరు శాతం చెల్లింపులు చేయనున్నట్లు పేర్కొంది. తమ వ్యాపార విభాగాల పనితీరు ఆధారంగా మిగిలిన ఉద్యోగులకు చెల్లింపులు ఉంటాయని తెలిపింది. ఇలా ఎక్కువ మందికి పూర్తి వేరియబుల్ పే చెల్లింపులు చేయడం ఇది వరుసగా రెండోసారి అని సంస్థ తెలిపింది.

''క్వార్టర్లీ వేరియబుల్ పే ప్లాన్ ప్రకారం సీ2 గ్రేడ్ వరకు ఉన్న అందరు ఉద్యోగులకు నూరు శాతం వేరియబుల్ పే అందుకుంటారు. సీ3 గ్రేడ్, ఆపై ఉన్న వారికి వారి విభాగాల పనితీరు ఆధారంగా చెల్లింపులు ఉంటాయి'' అని టీసీఎస్ చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ ఉద్యోగులకు పంపిన ఇ-మెయిల్‌లో పేర్కొన్నారు.

టీసీఎస్‌లో ఉద్యోగుల్లో వివిధ గ్రేడ్‌లు విభజన ఉంటుంది. వై లెవెల్ అనేది ట్రైనీలతో ప్రారంభమవుతుంది. తర్వాత సిస్టమ్ ఇంజనీర్లు (C1) ఉంటారు. ఆ తరువాత C2, C3, C4, C5 ఇలా గ్రేడ్‌ల వారీ విభజన ఉంటుంది. సాధారణంగా C3, అంతకంటే ఎక్కువ బ్యాండ్‌ల్లోని సిబ్బందిలో సీనియర్ మేనేజర్లు, వ్యాపార యూనిట్ హెడ్స్‌గా ఉంటారు.*




## విశాఖలో మెరుగైన నెట్‌వర్క్‌గా జియో

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న టెలికాం ఆపరేటర్‌గా రిలయన్స్ జియో నిలిచింది. కీలకమైన వాయిస్, డేటా పనితీరులో ఇతర టెల్కోలను వెనక్కి నెట్టింది. నగరంలో ఇటీవల ట్రాయ్ నిర్వహించిన ఇండిపెండెంట్ డ్రైవ్ టెస్ట్ (ఐడీటీ)లో జియో తన బలమైన మొబైల్ నెట్‌వర్క్ సామర్థ్యాన్ని నిరూపించుకుంది. మిలియన్ల మంది వినియోగదారులకు అత్యుత్తమ డిజిటల్ సేవలను అందించడంలో తన ప్రత్యేకతను మరోసారి చాటుకుంది.

ట్రాయ్ నివేదిక ప్రకారం రిలయన్స్ జియో తన 4జీ నెట్‌వర్క్‌లో 204.91 ఎంబీపీఎస్ సగటు డౌన్‌లోడ్ వేగాన్ని నమోదు చేసింది. ఇది నగరంలోని అన్ని ఆపరేటర్లలో అత్యధికం. ఈ అసాధారణ పనితీరు వల్ల జియో కస్టమర్‌లు గరిష్ట వినియోగ సమయాల్లో కూడా వేగవంతమైన వీడియో స్ట్రీమింగ్, ఆన్‌లైన్ గేమింగ్, వేగవంతమైన యాప్ డౌన్‌లోడ్‌లు, అంతరాయం లేని బ్రౌజింగ్‌ను ఆస్వాదించేలా చేస్తుంది.

మరోవైపు వాయిస్ సేవల్లోనూ జియో పనితీరు అంతే బలంగా ఉంది. జియో సేవలు అధిక కాల్ సెటప్ సక్సెస్ రేటు, తక్కువ కాల్ సెటప్ సమయం, జీరో కాల్ డ్రాప్ రేటుతోపాటు మెరుగైన వాయిస్ స్పష్టత అందిస్తున్నాయని ట్రాయ్ నివేదిక సూచిస్తోంది.

విశాఖపట్నం అంతటా విస్తృత ప్రాంతాన్ని కవర్ చేసిన ఈ డ్రైవ్ టెస్ట్ ఫలితాలు జియోను అత్యుత్తమ ఆపరేటర్‌గా నిలబెట్టాయి. హెచ్‌డీ కంటెంట్‌ను స్ట్రీమింగ్ చేసినా, హెచ్‌డీ-నాణ్యత వాయిస్ కాల్‌లు చేసినా లేదా రియల్ టైమ్ అప్లికేషన్‌లను యాక్సెస్ చేసినా ఎలాంటి అవాంతరాలు లేవని తేలింది.

# మొన్న రూ.800 కోట్లు.. ఇప్పుడు రూ.1,600 కోట్లు




ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటలిజెన్స్(ఏజీఐ)ను అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన సూపర్ ఇంటెలిజెన్స్ ల్యాబ్(ఎంఎస్ఎల్)లో పని చేసేందుకు మెటా కళ్లు చెదిరిపోయే ప్యాకేజీలను ప్రకటిస్తోంది. యాపిల్, ఓపెన్‌ఏఐ, గూగుల్ డీప్‌మైండ్, ఆంత్రోపిక్..వంటి ప్రముఖ సంస్థలకు చెందిన ప్రపంచంలోని టాప్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిశోధకులను ఆకర్షించడమే లక్ష్యంగా రూ.800 కోట్ల నుంచి రూ.1,600 కోట్ల పరిహార ప్యాకేజీలను అందిస్తోంది. ఇటీవల మెటాలో చేరిన యాపిల్‌కు చెందిన రుమింగ్ పాంగ్‌కు రూ.1,600 కోట్లు (సుమారు 200 మిలియన్ డాలర్లు) పరిహార ప్యాకేజీని ఆఫర్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. మెటా మాజీ ఓపెన్‌ఏఐ పరిశోధకుడు త్రపిత్ బన్సాల్‌కు రూ.800 కోట్లు (100 మిలియన్ డాలర్లు) ఆఫర్ చేసినట్లు తెలిసింది. కంపెనీ 'ఓ-సిరీస్' మోడళ్లను సృష్టించడంలో బన్సాల్ ప్రముఖ పాత్ర పోషించారు. మెటా ఈ ప్యాకేజీలను ధ్రువీకరించనప్పటికీ వేతనం, పరిహార బోనస్‌లు, స్టాక్ గ్రాంట్లు కలిపి కొన్ని కంపెనీల సీఈఓలు సంపాదించే వేతనంతో సమానంగా, అంతకుమించి ఉన్నాయని తెలుస్తుంది.

గూగుల్, ఎక్స్, మెటా, ఓపెన్‌ఏఐ.. వంటి ప్రధాన కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా జనరేటివ్ ఏఐ మోడళ్లను సృష్టిస్తున్నాయి. ఈ సంస్థల మధ్య పోటీ తీవ్రతరం అవుతుంది. దాంతో తోటివారికంటే ఓ అడుగు ముందుడాలనే భావనతో కంపెనీ ఏఐ నైపుణ్యాలున్నవారికి భారీ ప్యాకేజీలు ప్రకటిస్తున్నాయి. కృత్రిమ మేధస్సుపై ఆధిపత్యం చెలాయించే రేసులో భాగంగా మెటా కీలక ప్రచారం ప్రారంభించినట్లు ఇటీవల కొన్ని సంస్థలు తెలుపుతున్నాయి. ఈ విభాగంలో అగ్రశ్రేణి ఏఐ ప్రతిభావంతులను ఆకర్షించేందుకు భారీ ప్యాకేజీ ప్రకటిస్తున్నట్లు తెలుస్తుంది. మెరుగైన ఏఐ నైపుణ్యాలున్న ఎక్స్‌పర్ట్‌లకు ఎంత ప్యాకేజీ చెల్లించేందుకైనా వెనుకాడడం లేదని సమాచారం.

# భారత్‌లో టెస్లా ప్రవేశం.. మొదటి షోరూమ్ ఓపెన్

TESLA



ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని మేకర్ మ్యాక్సిటీ మాల్‌లో ఎలాన్‌మస్క్‌కు చెందిన టెస్లా తన మొదటి షోరూమ్‌ను మంగళవారం ప్రారంభించింది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఈ షోరూమ్ ప్రారంభోత్సవానికి హాజరై మాట్లాడారు. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, అభివృద్ధి కోసం టెస్లా భవిష్యత్తు ప్రణాళికలపై ఆశాభావం వ్యక్తం చేశారు. టెస్లా భారత్‌లోనూ తయారీ ప్లాంట్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. 'టెస్లా తన వ్యాపార విస్తరణ కోసం సరైన నగరాన్ని ఎంచుకుంది. మహారాష్ట్ర భారతదేశానికి వ్యవస్థాపక రాజధానిగా కొనసాగుతోంది. 2015లో యూఎస్ పర్యటనలో భాగంగా టెస్లాలో మొదటగా ప్రయాణించాను. ఇండియాలోనూ ఇలాంటి కార్లు రావాలని భావించాను. పదేళ్ల తర్వాత అది ఇప్పుడు సాధ్యమైంది' అని ఫడ్నవీస్ అన్నారు. కంపెనీ తన ఎలక్ట్రిక్ వాహనాల ధరలను కూడా ఈ సందర్భంగా వెల్లడించింది. మోడల్ వై ఆన్ రోడ్ ధర రూ.61 లక్షలుగా తెలిపింది. రియర్ వీల్ డ్రైవ్ వెర్షన్ ధర రూ.59.89 లక్షలుగా ఉందని చెప్పింది. భారత్ ఇప్పటికే ప్రకటించిన ఈవీ పాలసీ ప్రకారం దిగుమతి సుంకాల తగ్గింపు, ప్రపంచ ఎలక్ట్రిక్ వాహన తయారీదారులకు ప్రోత్సాహకాలు అందించడం వంటివి టెస్లాకు మరింత మద్దతు ఇవ్వవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఫిబ్రవరిలో ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా వ్యక్తిగతంగా సమావేశం అయ్యారు. అనంతరం మోదీ, ఎలాన్ మస్క్ ఏప్రిల్‌లో ఫోన్ కాల్‌లో టెక్నాలజీ, ఇన్నోవేషన్‌లో సాధ్యాసాధ్యాలపై చర్చించారు.

# రోజుల వరుస నష్టాలకు బ్రేక్.. లాభాల్లో ముగిసిన సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో పాటు దేశీయంగా రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ఠానికి చేరడం వంటి కారణాలు పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమయ్యాయి. దీంతో నాలుగు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ఆటో ఇండెక్స్ ఒకటిన్నర శాతం మేర లాభపడగా.. ఫార్మా, హెల్త్ కేర్ సూచీలు ఒక శాతం మేర పెరిగాయి.

సెన్సెక్స్ ఉదయం 82,233.16 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,253.46) స్వల్ప నష్టాల్లో ప్రారంభమయ్యాయి. కాసేపటి తర్వాత మళ్లీ



లాభాల బాట పట్టిన సూచీ.. ఇంట్రాడేలో 82,743.62 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 317.45 పాయింట్ల లాభంతో 82,570.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 113.50 పాయింట్ల లాభంతో 25,195.80 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.82గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా మోటార్స్, ట్రెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు రాణించాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, టాటా స్టీల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 68.99 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3,374 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



## ఫహాద్ అలా.. మతిమరుపు వ్యక్తిగా వడివేలు

ఫహాద్ ఫాజిల్ పేరు చెప్పగానే క్రేజీ సినిమాలు, డిఫరెంట్ పాత్రలు గుర్తొస్తాయి. 'పుష్ప 2' సినిమాతో తెలుగులోనూ మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న ఇతడు.. ప్రస్తుతం తమిళంలో 'మారీషన్' అనే మూవీ చేస్తున్నాడు. ఇందులో సీనియర్ కమెడియన్ వడివేలు కూడా నటిస్తున్నాడు. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ రిలీజైంది. ఇంతకీ మూవీ సంగతేంటి?

ఇదో తమిళ సినిమా. దొంగతనాలు చేసిన ఒకడు(ఫహాద్).. డబ్బులతో ఉన్న మతిమరుపు వ్యక్తిని(వడివేలు) చూస్తాడు. అతడి దగ్గర నుంచి ఎలాగైనా సరే డబ్బు కొట్టేయాలని దగ్గరయ్యే ప్రయత్నం చేస్తాడు. ఈ క్రమంలోనే వీళ్లిద్దరూ కలిసి తిరువణ్ణామలైకి బైక్‌పై వెళ్తారు. మరోవైపు మతిమరుపు వ్యక్తి కోసం పోలీసులు వెతుకుతుంటారు. ఈ ప్రయాణంలో ఏం జరిగింది? చివరకు ఏమైందనేదే స్టోరీలా అనిపిస్తోంది.జూలై 25న ఈ సినిమా థియేటర్లలోకి రానుంది. చూస్తుంటే ఫహాద్ ఫాజిల్ మరో డిఫరెంట్ చిత్రం చేశాడని అర్థమైంది. ప్రస్తుతానికైతే తమిళ వెర్షన్ మాత్రమే బిగ్ స్క్రీన్‌పైకి రానుంది. తెలుగు డబ్బింగ్ కోసం ఓటీటీలోకి వచ్చేంతవరకు వెయిట్ చేయక తప్పదు. గతంలో ఫహాద్-వడివేలు కలిసి 'మామన్నన్' మూవీ చేశారు. ఇప్పుడు మరోసారి హిట్ కొట్టేందుకు వచ్చేస్తున్నారు. చూడాలి మరి ఏం చేస్తారో?

## అందుకే రూమర్స్ పట్టించుకోను: నిధి అగర్వాల్

అగ్ర కథానాయకులతో కలిసి సందడి చేయడానికి సిద్ధమయ్యారు నటి నిధి అగర్వాల్ . పవన్‌తో 'హరిహర వీరమల్లు', ప్రభాస్‌తో 'ది రాజాసాబ్'తో ఈ ఏడాది ప్రేక్షకులకు వినోదాన్ని అందించనున్నారు. హరిహర వీరమల్లు జులై 24న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా నిధి ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. తెలుగు ప్రేక్షకులంటే తనకెంతో ఇష్టమని తెలిపారు. తెలుగు సినిమాల్లో నటించే అవకాశం రావడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు."హరిహర వీరమల్లు సినిమా ఓ విజువల్ వండర్‌లా ఉంటుంది. ఏఎం రత్నం ఎక్కడా రాజీ పడకుండా దీన్ని నిర్మించారు. ఆయన ఈ సినిమా విజయంపై ఎంతో ధీమాగా ఉన్నారు. నేను ట్రైలర్ ఎన్నిసార్లు చూశానో లెక్కేలేదు. ఈ సినిమా ప్రారంభంలో ఎన్నో రూమర్స్ వచ్చాయి. ట్రైలర్ రిలీజ్ అయ్యాక వాటన్నిటికీ చెక్ పడింది. మనం ఓ పనిచేస్తున్నప్పుడు ఎన్నో కామెంట్స్ వినిపిస్తాయి. వాటిని పట్టించుకోకుండా మన పని మనం చేయాలి. మొదట బాలేదు అన్న ప్రేక్షకులే వెంటనే చాలా బాగుంది అని అంటారు. చాలా బాగా నటించారు అని కామెంట్ చేస్తారు. అందుకే రూమర్స్‌ను పట్టించుకోకుండా మన పని శ్రద్ధగా చేస్తూ ఉండాలి""హరిహర వీరమల్లు కోసం పవన్ ఎంతో కష్టపడ్డారు. దీనికోసం వర్క్‌షాప్‌లు చేశారు. సినిమాలో ప్రతి విభాగంలోనూ ఆయన భాగమయ్యారు. డైలాగ్స్, పాటలు, యాక్షన్ సన్నివేశాలు అన్నిటికీ సలహాలిచ్చారు. ఎన్నికల ముందు దీన్ని ప్రారంభించారు. డిప్యూటీ సీఎం అయ్యాక దీన్నే మొదట పూర్తి చేశారు. 5 ఏళ్ల కాలంలో ఆయనలో ఎలాంటి మార్పు రాలేదు. విజయవాడలో షూటింగ్ చేసినన్ని రోజులు విరామ సమయంలో ఒకవైపు మీటింగ్‌లో పాల్గొంటూనే చిత్రీకరణకు వచ్చేవారు. 'హరిహర వీరమల్లు' పార్ట్-2 కూడా 20 నిమిషాల షూటింగ్ పూర్తి చేశాం. మొదటి పార్ట్ విడుదలైన తర్వాత దాన్ని తిరిగి ప్రారంభిస్తాం" అని నిధి అగర్వాల్ తెలిపారు.









## 'సత్యం' మూవీ ఒప్పుకొంటే వద్దన్నారు.. ఆసక్తికర విషయం చెప్పిన జెనీలియా

రీఎంట్రీలో ఒకేసారి తనకు 500 సినిమాలు చేసేయాలని లేదని, నిడివి తక్కువ ఉన్నా, ప్రభావవంతమైన పాత్రలే చేస్తానని అంటున్నారు జెనీలియా . 'బొమ్మరిల్లు' హాసినిగా తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఆమె, బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్‌తో వివాహం తర్వాత సినిమాలకు విరామం ఇచ్చారు. 2012 తర్వాత తెలుగులో ఒక్క మూవీ చేయలేదు. ఇప్పుడు కిరీటి హీరోగా రాధాకృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జూనియర్' . శ్రీలీల కథానాయిక. ఇందులో జెనీలియా కీలక పాత్ర పోషించారు. జులై 18న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

**వైవిధ్యమైన పాత్రలే చేస్తా..**

''దాదాపు 13ఏళ్ల తర్వాత దక్షిణాది చిత్రంలో నటిస్తున్నా. మూడేళ్ల కిందట ఈ సినిమా కథ విన్నా. అప్పటికి నేను నటించాలా?వద్దా? అన్న నిర్ణయం తీసుకోలేదు. ఎందుకంటే, నా పిల్లల ఆలనాపాలనా చూసుకుంటున్నా. దర్శకుడు కథ చెప్పిన విధానం నాకు బాగా నచ్చింది. గతంలో చేయని పాత్రలే చేయాలనుకున్నా. అందుకే ఈ సినిమా చేయడానికి ఒప్పుకొన్నా. మంచి బృందంతో కలిసి పనిచేసిన అనుభూతి కలిగింది. కిరీటి ఫస్ట్ మూవీ అయినా, చాలా చక్కగా చేశాడు. తనపై తనకు నమ్మకం ఉంది. డ్యాన్స్, యాక్టింగ్, ఫైట్స్ కోసం చాలా కష్టపడ్డాడు. ''గంభీరంగా ఉంటుంది..

''జూనియర్'లో నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. బాస్‌గా గంభీరమైన పాత్రలో కనిపిస్తా. ఇంతకు ముందు చేయని నటులతో కలిసి నటించాలని ఉంది. అదే సమయంలో ప్రయోగాత్మకంగా ఏ పాత్ర చేయడానికైనా సిద్ధమే. ఇప్పటికిప్పుడే వరుసగా సినిమాలు చేయాలన్న ఆలోచన లేదు. మంచి పాత్రలు వస్తే తప్పకుండా చేస్తా. కొన్ని పాత్రలు ప్రేక్షకులు ఎప్పటికీ మర్చిపోరు, చేసేది చిన్న పాత్ర అయినా గుర్తుండిపోతుంది. తెరపై ఎంతసేపు కనిపించామన్నది ముఖ్యం కాదు. మనం చేసిన పాత్ర ఎంత ప్రభావం చూపించిందన్నదే ముఖ్యం. 'జూనియర్' మంచి ఎంటర్‌టైనర్. ఇందులో తండ్రీ కొడుకుల సెంటిమెంట్ ఉంటుంది.''

**నాకు ఆ అభిమానం దక్కింది..**

''సాధారణంగా హీరోయిన్స్‌కు పెద్దగా అభిమానులు ఉండరు. కానీ, 'హాసిని' పాత్రతో నాకు ఎంతో మంది అభిమానులయ్యారు. భవిష్యత్‌లో తెలుగులోనూ సినిమాలు చేయాలని ఉంది. కెరీర్‌లో బిజీగా ఉండగానే పెళ్లి చేసుకున్నా. ఎందుకంటే జీవితం కూడా ముఖ్యమే కదా! తెలుగులో నన్ను జెనీలియా అని ఎవరూ పిలవరు. హాసిని అనే పిలుస్తారు. అంతలా ఆ పాత్ర చేరువైంది. 'బొమ్మరిల్లు 2' ఉంటుందేమో చూడాలి. ఒక అమ్మాయికి హాసినిలాంటి పాత్ర చేయడం చాలా కష్టం''

**సమంత బాగా చేసింది..**

''మజిలీ' రీమేక్ 'వేద్'లో నటించడం చాలా సంతోషంగా ఉంది. తెలుగులో సమంత బాగా చేసింది. చాలా అందమైన చిత్రం. మా సొంత ప్రొడక్షన్ హౌస్‌లో చేశాం. మరాఠీలో బాగా ఆడింది. చిన్నప్పటి నుంచి నటిని కావాలనుకోవడం నా కల. అనుకున్నట్లుగానే అయ్యాను. ప్రత్యేకంగా డ్రీమ్‌రోల్స్ అంటూ ఏమీ లేవు. శంకర్ సర్ 'బాయ్స్'.. రాజమౌళిగారి 'సై' దిల్‌రాజుభాస్కర్ కాంబో 'బొమ్మరిల్లు' ప్రేక్షకులకు నన్ను మరింత దగ్గర చేశాయి''

**ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నా..**

''కోట శ్రీనివాసరావు నటనకు నిలయంలాంటి వారు. 'బొమ్మరిల్లు' చేసే సమయంలో నటనకు సంబంధించి ఎన్నో విషయాలు ఆయన ద్వారా తెలుసుకున్నా. కోట శ్రీనివాసరావు, ప్రకాశ్‌రాజ్‌లాంటి వారితో నటించడం నా అదృష్టం. ఇప్పుడు ఆ సినిమాలు చూస్తుంటే, 'ఇంత పెద్ద నటులతోనా నేను చేసింది' అనిపిస్తుంది. ఇక 'ఆర్ఆర్ఆర్' చూసినప్పుడు ఈ అబ్బాయితోనా నేను 'ఆరెంజ్' చేసింది అనుకున్నా. ఎన్టీఆర్ అద్భుతమైన నటుడు. మూడు పేజీల డైలాగ్ ఉన్నా, అలా చెప్పేస్తారు. అలాగే అల్లు అర్జున్‌లో మంచి ఎనర్జీ ఉంటుంది''

**'సత్యం' వద్దన్నారు..**

''నువ్వే కావాలి' రీమేక్ 'తుజే మేరీ కసమ్'తో హిందీలో ఎంట్రీ ఇచ్చా. ఆ తర్వాత తమిళ్‌లో 'బాయ్స్' చేశా. తెలుగులో 'సత్యం' చేశాను. అన్నీ మంచి పేరు తెచ్చి పెట్టాయి. 'సత్యం' ఒప్పుకొన్న తర్వాత 'ఆ సినిమా చేయొద్ద'ని చాలా మంది సలహా ఇచ్చారు. ఎందుకంటే 'బాయ్స్'లో చేసిన యూత్‌ఫుల్ పాత్రలే చేయాలని సలహా ఇచ్చారు. కానీ, నా హృదయం చెప్పిన మాట విని ఒప్పుకొన్నా. ఆ సినిమా మంచి హిట్ అయింది. ఎవరైనా వచ్చి సినిమా కథ చెబితే, అది అర్థవంతంగా అనిపిస్తే చేసేయాలి. ప్రేక్షకులే మనల్ని గుర్తిస్తారు. తెరపై మన పని మాట్లాడుతుంది'' అని జెనీలియా చెప్పారు.\


## మూడు రోజుల్లో మూడు విషాదాలు..
### నటుడు ధీరజ్ కుమార్ మృతి

ఇటీవల సినీ పరిశ్రమలో వరుసగా విషాదాలు చోటు చేసుకుంటున్నాయి. టాలీవుడ్‌లో కోట శ్రీనివాసరావు మరణించగా.. ఆ తర్వాత మరో సీనియర్ నటి సరోజా దేవి కూడా కన్నుమూశారు. ఇవాళ మరో ప్రముఖ నటుడు మృతి చెందారు. బాలీవుడ్ నిర్మాత అయిన ధీరజ్ కుమార్ ముంబయిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయన న్యుమోనియాతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరగా.. కోలుకోలేక తుదిశ్వాస విడిచారు.కాగా.. ధీరజ్ కుమార్ 1965లో సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టారు. ఆయన తన కెరీర్‌లో సినిమాలతో పాటు సీరియల్స్‌లోనూ నటించారు. 1970 1984 మధ్య దాదాపు 21 పంజాబీ చిత్రాలలో నటించాడు. 'ఓం నమః శివాయ్' వంటి ఆధ్యాత్మిక, పౌరాణిక కార్యక్రమాలకు ప్రసిద్ధి చెందిన క్రియేటివ్ ఐ అనే నిర్మాణ సంస్థను స్థాపించాడు. అంతేకాకుండా 'స్వామి', 'హీరా పన్నా' 'రాతోన్ కా రాజా' వంటి లాంటి హిందీ చిత్రాలలో కూడా నటించాడు. ఆ తర్వాత రోటీ కపడా ఔర్ మకాన్ (1974), సర్గం (1979), క్రాంతి (1981) వంటి చిత్రాలలో సహాయక పాత్రలు పోషించారు. దాదాపు ఐదు దశాబ్దాలకు పైగా సినిమాల్లో ధీరజ్ కుమార్ కొనసాగారు. ధీరజ్ కుమార్ మరణ వార్తను ధృవీకరించిన ఆయన కుటుంబం.. అభిమానులు, శ్రేయోభిలాషుల ప్రార్థనలకు కృతజ్ఞతలు తెలిపింది. రేపు ఉదయం 10 గంటల వరకు అభిమానుల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఇంటివద్దకు తరలించనున్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు విలే పార్లే వెస్ట్‌లోని పవన్ హన్స్ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరుగుతాయి.



# 128 ఏళ్ల తర్వాత ఒలింపిక్స్‌లో

## క్రికెట్.. షెడ్యూల్ విడుదల



128 ఏళ్ల తర్వాత ఒలింపిక్స్‌లోకి క్రికెట్ పునఃప్రవేశించనుంది. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌తో క్రికెట్ విశ్వక్రీడల్లోకి పునరాగమనం చేయనుంది. ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను జులై 14న ప్రకటించారు. ఈ షెడ్యూల్‌ను మూడేళ్లు ముందే ప్రకటించడం విశేషం.

ఒలింపిక్స్‌లో క్రికెట్ పోటీలు 2028 జులై 12 (ఒలింపిక్స్ ప్రారంభానికి రెండు రోజుల ముందు) నుంచి 29 వరకు జరుగనున్నాయి. అన్ని మ్యాచ్‌లు లాస్ ఏంజెలెస్‌కు 50 కిమీ దూరంలో ఉన్న పమోనాలోని ఫెయిర్‌ప్లెక్స్‌లో ప్రత్యేకంగా నిర్మించబడే 500 ఎకరాల తాత్కాలిక స్టేడియంలో జరుగుతాయి.

రాబోయే ఒలింపిక్స్‌లో క్రికెట్ టీ20 ఫార్మాట్‌లో జరుగనుంది. పురుషులు, మహిళల విభాగాల్లో మొత్తం ఆరు అంతర్జాతీయ జట్లు విశ్వవేదికపై పోటీ పడతాయి. గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ కోసం పోటీ జరుగుతుంది. మెడల్స్ మ్యాచ్‌లు (సెమీఫైనల్స్ మరియు బ్రాంజ్, గోల్డ్ మెడల్స్ మ్యాచ్‌లు) జులై 20 (మహిళలు), 29 (పురుషులు) తేదీల్లో జరుగుతాయి.

జులై 14, 21 తేదీల్లో ఎలాంటి క్రికెట్ మ్యాచ్‌లు లేవు.

మ్యాచ్ జరిగిన ప్రతి రోజు రెండు మ్యాచ్‌లు ఉంటాయి. ఈ మ్యాచ్‌లు భారతకాలమానం ప్రకారం రాత్రి 9:30 గంటలకు, ఉదయం 7 గంటలకు మొదలవుతాయి. ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చివరి మరియు ఏకైక ప్రాతినిధ్యం 1900 పారిస్ ఒలింపిక్స్‌లో దక్కింది. నాడు గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్స్ మాత్రమే పోటీలో పాల్గొన్నాయి. అప్పుడు ఇరు జట్ల మధ్య ఓ అనధికారిక టెస్ట్ మ్యాచ్ జరగగా.. అందులో గ్రేట్ బ్రిటన్ ఫ్రాన్స్‌ను కేవలం రెండు రోజుల్లోనే ఓడించి స్వర్ణ పతకం కైవసం చేసుకుంది.

కాగా, 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌తో పాటు బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోస్ (సిక్సస్), స్క్వాష్ జోడించబడ్డాయి.



## 27 పరుగులకే విండీస్ ఆలౌట్.. టెస్టుల్లో అత్యల్ప స్కోర్లు ఇవే

- కింగ్‌స్టన్ (జమైకా): సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టెస్టులో వెస్టిండీస్ ఘోర పరాజయం చవిచూసింది. రెండో ఇన్నింగ్స్‌లో కంగారూలను 121 పరుగులకు ఆలౌట్ చేసి సంబరపడిన ఆతిథ్యజట్టుకు ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. 204 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన విండీస్.. అనూహ్యంగా 27 పరుగులకే చాపచుట్టేసింది. మిచెల్ స్టార్క్ (6/9) సంచలన బౌలింగ్‌తో కరేబియన్ బ్యాటర్లను బెంబేలెత్తించాడు. అతనికితోడుగా స్కాట్ బోలాండ్ (3/2) హ్యాట్రిక్‌తో మెరవడంతో విండీస్ పేకమేడలా కుప్పకూలింది. టెస్టు క్రికెట్ చరిత్రలో ఇది రెండో అత్యల్ప స్కోరు. స్టార్క్ తన మొదటి ఓవర్‌లో మూడు వికెట్లు తీశాడు. మొత్తంగా 15 బంతుల వ్యవధిలో ఐదు వికెట్లు పడగొట్టి విండీస్ పతనాన్ని శాసించాడు. ఈ క్రమంలోనే టెస్టు క్రికెట్ చరిత్రలో అతి తక్కువ బంతుల్లోనే ఐదు వికెట్లు సాధించిన బౌలర్‌గా స్టార్క్ రికార్డు సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో 176 పరుగుల భారీ తేడాతో విజయం సాధించిన ఆస్ట్రేలియా మూడు టెస్టుల సిరీస్‌ను 30తో క్లీన్‌స్వీప్ చేసింది. విండీస్ బ్యాటర్లలో ఏడుగురు డకౌటయ్యారు. జస్టిన్ గ్రీవ్స్ (11) ఒక్కడే రెండంకెల స్కోరు చేశాడు. 87 బంతుల్లోనే 10 వికెట్లు కోల్పోయిన కరేబియన్ జట్టు తక్కువ బాల్స్‌లో ఆలౌటైన మూడో జట్టుగా చెత్త రికార్డు మూటగట్టుకుంది. సౌతాఫ్రికా (75; ఇంగ్లాండ్‌పై.. 1924), శ్రీలంక (83; సౌతాఫ్రికాపై, 2024) తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి.
- 
- టెస్టు క్రికెట్‌లో అత్యల్ప స్కోర్లు
- న్యూజిలాండ్ 26 (ఇంగ్లాండ్‌పై, 1955)
- వెస్టిండీస్ 27 (ఆస్ట్రేలియాపై, 2025)
- సౌతాఫ్రికా 30 (ఇంగ్లాండ్‌పై, 1896)
- సౌతాఫ్రికా 30 (ఇంగ్లాండ్‌పై, 1924)
- సౌతాఫ్రికా 35 (ఇంగ్లాండ్‌పై, 1899)
- సౌతాఫ్రికా 36 (ఆస్ట్రేలియాపై, 1932)
- ఆస్ట్రేలియా 36 (ఇంగ్లాండ్‌పై, 1902)
- భారత్ 36 (ఆస్ట్రేలియాపై, 2020)





## రాహుల్ ద్రవిడ్ కొడుకుకు బిగ్ షాక్..

బెంగళూరు వేదికగా మంగళవారం మహారాజా ట్రోఫీ కేఎస్‌సీఏ టీ20 టోర్నీ-2025 వేలం జరిగింది. ఈ వేలంలో - మైసూర్ వారియర్స్, హుబ్లి టైగర్స్, బెంగళూరు బ్లాస్టర్స్, శివమొగ్గ లయన్స్, మంగళూరు డ్రాగన్స్, గుల్బర్గా మిస్టిక్స్ మొత్తం ఆరు ఫ్రాంచైజీలు తమ కావాల్సిన ఆటగాళ్లను కొనుగోలు చేసుకున్నాయి.ఈ వేలంలో కర్ణాటక స్టార్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్‌పై కాసుల వర్షం కురిసింది. అతడిని హుబ్లి టైగర్స్ రికార్డు స్థాయిలో రూ.13.20 లక్షలకు కొనుగోలు చేసింది. ఈ ఏడాది సీజన్ వేలంలో అత్యంత ఖరీదైన ఆటగాడిగా పడిక్కల్ నిలిచాడు. అదేవిధంగా హుబ్లి టైగర్స్ అభినవ్ మనోహర్‌ను సైతం రూ. 12.20 లక్షలకు సొంతం చేసుకుంది. హుబ్లి ఫ్రాంచైజీ వీరిద్దరిపైనే దాదాపు సగంపైగా మొత్తాన్ని ఖర్చుచేసింది. టీమిండియా వెటరన్, కేకేఆర్ ఆటగాడు మనీష్ పాండేను రూ. 12.20 లక్షలకు మైసూర్ వారియర్స్ దక్కించుకుంది.సమిత్ ద్రవిడ్‌కు బిగ్ షాక్..కాగా మహారాజా టీ20 వేలంలో భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ కుమారుడు సమిత్ ద్రవిడ్ అమ్ముడుపోలేదు. రూ. 50 వేలు కనీస ధరతో వచ్చిన అతడిని ఏ ఫ్రాంచైజీ కొనుగొలు చేసేందుకు ఆసక్తి చూపలేదు. సమిత్ ద్రవిడ్ గత ఎడిషన్‌లో మైసూరు వారియర్స్ జట్టులో భాగంగా ఉన్నాడు.

అయితే అంచనాలకు తగ్గటు జూనియర్ అంచనాలకు తగ్గట్టు రాణించలేకపోయాడు. గత సీజన్‌లో ఏడు మ్యాచ్‌లు ఆడిన సమిత్.. 11.71 సగటుతో 82 పరుగులు చేశాడు. ఈ క్రమంలోనే అతడు ప్రస్తుతం వేలంలో అమ్ముడు పోలేదని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఇక ఈ మెగా టోర్నీ బెంగళూరులోని ఐకానిక్ చిన్నస్వామి స్టేడియం వేదికగా ఆగస్టు 11 నుంచి 27 వరకు జరగనుంది. అయితే గతంలో మాదిరిగా కాకుండా ఈసారి ఈ టోర్నీని ఖాళీ స్టేడియంలో నిర్వహించనున్నారు.

ఆర్సీబీ ఐపీఎల్ ట్రోఫీ విజయోత్సవ ర్యాలీ సందర్భంగా తొక్కిసలాట జరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఈవెంట్‌లో కరుణ్ నాయర్, ప్రసిధ్ కృష్ణ, మయాంక్ అగర్వాల్ వంటి స్టార్ ప్లేయర్లు కూడా ఆడనున్నారు.

## చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ.. వరల్డ్ రికార్డు బద్దలు



ఇంగ్లండ్ గడ్డపై భారత యువ సంచలనం, అండర్ 19 స్టార్ వైభవ్ సూర్యవంశీ హవా కొనసాగుతోంది. బెకన్‌హామ్ వేదికగా ఇంగ్లండ్ అండర్19తో జరుగుతున్న తొలి యూత్ టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌లో విఫలమైన వైభవ్.. బౌలింగ్‌లో మాత్రం సత్తాచాటాడు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అయిన వైభవ్ రెండు కీలక వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు.

అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన ఇంగ్లండ్ కెప్టెన్ హంజా షేక్(84),థామస్ రెవ్(34) వికెట్లను వైభవ్ పడగొట్టాడు. ఈ క్రమంలో 14 ఏళ్ల వైభవ్ ఓ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. గల్ఫ్ న్యూస్ రిపోర్ట్ ప్రకారం.. ఓ యూత్ టెస్టు మ్యాచ్‌లో వికెట్ సాధించిన అతి పిన్న వయస్కుడిగా వైభవ్ రికార్డు సృష్టించాడు. ఇంతకుముందు ఈ రికార్డు భారత అండర్19 క్రికెటర్ మనిషీ పేరిట(15) ఉండేది. తాజా మ్యాచ్‌తో మనిషీ రికార్డును వైభవ్ బ్రేక్ చేశాడు.

### సూపర్ ఫిఫ్టీ..

రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం వైభవ్ బ్యాట్ ఝుళిపించాడు. 44 బంతులు ఎదుర్కొన్న వైభవ్.. 9 ఫోర్లు, సిక్సర్ సాయంతో 56 పరుగులు చేసి ఔటయ్యాడు. అతడితో పాటు కెప్టెన్ ఆయూశ్ మాత్రే(32) రాణించాడు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి యువ భారత జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 128 పరుగులు చేసింది.

ప్రస్తుతం క్రీజులో విహాన్ మల్హోత్రా (34), అభిగ్యాన్ కుందు (0) క్రీజ్‌లో ఉన్నారు. భారత్ 229 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతుంది. ఇంగ్లండ్ బౌలర్లలో



ఆర్చీ వాన్ 3 వికెట్లు తీశాడు. అంతకుముందు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 439 పరుగులకు



## 'నాలుగో టెస్టులో బుమ్రా ఆడాలి.. లేకపోతే భారత్ ఓటమి ఖాయం'.. హెచ్చరించిన మాజీ కెప్టెన్

ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లేందుకు వచ్చిన అద్భుత అవకాశాన్ని టీమ్ఇండియా చేజార్చుకుంది. లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్టులో భారత్ 22 పరుగుల స్వల్ప తేడాతో ఓడింది. దీంతో సిరీస్‌లో 12తో వెనకబడింది. సిరీస్‌ను చేజిక్కించుకోవాలంటే జులై 23 నుంచి మొదలుకానున్న నాలుగో టెస్టులో టీమ్ఇండియా తప్పుగా గెలవాల్సి ఉంటుంది. ఇలాంటి తరుణంలో భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రా నాలుగో టెస్టుకు దూరంగా ఉంటాడని వార్తలొస్తున్నాయి.

వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రా ఐదు మ్యాచ్‌ల్లో మూడింట మాత్రమే ఆడతాడని మేనేజ్‌మెంట్ ఇది వరకే స్పష్టం చేసింది. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన రెండో టెస్టులో బుమ్రా ఆడలేదు. అయితే, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా బుమ్రా మిగిలిన రెండు టెస్టులు ఆడాలని భారత మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే విజ్ఞప్తి చేశాడు. తాను గానుక టీమ్ఇండియా మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఉండి వుంటే అతడిని ఇందుకు ఒప్పించేందుకు ప్రయత్నించేవాడినని పేర్కొన్నాడు. నాలుగో టెస్టులో బుమ్రా ఆడకపోతే భారత్ ఓటమిపాలవడం ఖాయమని కుంబ్లే హెచ్చరించాడు.

'నేను గానుక టీమ్ఇండియా మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఉంటే బుమ్రాను తదుపరి మ్యాచ్ ఆడాలని కచ్చితంగా ఒత్తిడి చేస్తాను. ఎందుకంటే అది చాలా కీలకమైన మ్యాచ్. బుమ్రా ఆడకపోతే మ్యాచ్‌లో భారత్ ఓడిపోతుంది. దాంతో సిరీస్‌లో మన పోరాటం ముగుస్తుంది. బుమ్రా మిగిలిన రెండు టెస్టుల్లోనూ ఆడాలి. మూడు మ్యాచ్‌లే ఆడతానని అతడు చెప్పాడు. కానీ, లార్డ్స్ టెస్టు తర్వాత మనకు చాలా రోజుల విరామం ఉంది. స్వదేశంలో జరిగే సిరీస్‌లో బుమ్రా ఆడాల్సిన అవసరం లేదు. కావాలంటే అప్పుడు విరామం తీసుకోవచ్చు. కానీ, తదుపరి మ్యాచ్‌లో బుమ్రా ఆడాలి' అని అనిల్ కుంబ్లే కోరాడు.

లార్డ్స్‌లో జరిగిన మూడో టెస్టులో భారత్ ఓడినా.. బుమ్రా అద్భుత ప్రదర్శన చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో (5/75), రెండో ఇన్నింగ్స్‌లో (2/38) సత్తాచాటాడు. అనంతరం 193 పరుగుల లక్ష్యఛేదనలో 112/8తో భారత్ కష్టాల్లో పడింది. ఘోర పరాజయం తప్పదనుకున్న దశలో బుమ్రా సపోర్ట్ వల్లే టీమ్ఇండియా చివరి వరకు పోరాడింది. బుమ్రా (5; 54 బంతుల్లో) ఎంతో ఓపికతో ఆడి జడేజాకు సహకరించాడు.

